విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ: జేసీ

పార్వతీపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ..వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అనారోగ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. సందేహం ఉంటే వెంటనే వైద్యుడితో చికిత్స అందించాలని సూచించారు. నాణ్యమైన ఆహారం, విద్య అందించాలన్నారు. అనంతరం తోటపల్లి ఉద్యాన పార్కులో బోట్ షికారుపై టూరిజం బోట్ కంట్రోల్ రూమ్ యూనిట్ మేనేజర్, రుషికొండ ఏఈలతో జేసీ మాట్లాడారు.

బాధితులకు అండగా..



- ప్రకృతి వైపరీత్యాల పరిహారాన్ని పెంచిన ప్రభుత్వం
- మొంథా బాధిత కుటుంబాలకు లబ్ధి

శృంగవరపుకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. బాధిత కుటుంబాలకు చెల్లించే నష్ట పరిహారాన్ని మరింత పెంచింది. రాష్ట్ర విపత్తుల ప్రతిస్పందన నిధులు (ఎస్‌డీఆర్‌ఎఫ్)కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిధులను జోడించి ఇవ్వాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. దీంతో మొంథా తుఫాన్‌తో నష్టపోయిన కుటుంబాలకు లబ్ధిచేకూరనుంది. జిల్లాలో ప్రతి సంవత్సరం సంభవించే తుపాన్లు, వాయుగుండాలు, అల్పపీడనాలు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలతో తీవ్ర నష్టం వాటిల్లుతుంది. ఆనకట్టలు, నదులు, గెడలు, చెరువులు ఉప్పొంగి వేలాది ఎకరాల్లో పంటలు, పండ్ల తోటలు దెబ్బతింటున్నాయి. పశువులు, కోళ్లు, మేకలు, గొర్రెలు వంటి మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. ఆస్తి, ప్రాణ నష్టం కూడా జరుగుతుంది. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలి కొందరి జీవితాలు చిన్నాభిన్నమవుతున్నాయి. ఇలాంటి కుటుంబాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుల నిధి (ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర విపత్తుల నిధి (ఎస్‌డీఆర్‌ఎఫ్) నుంచి పరిహారం చెల్లిస్తున్నాయి. అయితే, రాష్ట్రంలో విపత్తుల నిధి తక్కువగా ఉంది. దీంతో 2024లో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆలోచనలో పడింది. ఎస్‌డీఆర్‌ఎఫ్‌కు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) నిధులను జోడించి బాధితులకు మెరుగైన సాయం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు యోచించారు. ఈ మేరకు రాష్ట్ర విపత్తుల నిధికి మించి పరిహారం ఇవ్వాలని అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా జిల్లాలోని పలు మండలాల్లో సుమారు 904 హెక్టార్లలో వరి, పత్తి తదితర వాటితో పాటు మరో 50 ఎకరాల్లో ఉద్యాన పంటలు నష్టపోయినట్లు ప్రాథమికంగా ఆయా శాఖల అధికారులు గుర్తించారు. హెక్టారుకు రాష్ట్ర విపత్తుల నిధి రూ.17వేలు మాత్రమే ఉంది. దీనికి మించి కూటమి ప్రభుత్వం హెక్టారుకు రూ.25వేలు చెల్లించనుంది. దెబ్బతిన్న ఇళ్లకు గతంలో రూ.5వేలు ఇచ్చేవారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం దీన్ని రూ.10వేలు చేసింది.

పరిహారం పెంపు ఇలా..

మనుషులు చనిపోతే గతంలో రూ.4లక్షల చెల్లించేవారు. ఇప్పుడు రూ.5లక్షలు ఇవ్వనున్నారు. ఆవులు, గేదెలు వంటి పశువుల మృతి చెందితే గతంలో రూ.37,500 చెల్లించగా, ఇప్పుడు రూ.50వేలు అందిస్తారు. వరి, పత్తి, వేరు శనగ, చెరకు, బొప్పాయి పంటలకు సంబంధించి హెక్టారుకు రూ.17 వేల నుంచి రూ.25వేలుకు సాయం పెంచారు. పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్లకు సంబంధించి రూ.5వేల నుంచి రూ.10వేలుకు పరిహారాన్ని పెంపుదల చేశారు.







యథావిధిగానే ..!

- ఈనెల దివ్యాంగులకు పింఛన్ల పంపిణీ
- పునఃపరిశీలన తర్వాతే చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): జిల్లాలో దివ్యాంగ పింఛన్‌దారులకు ఈ నెల యథావిధి గానే పింఛన్ సొమ్ము అందించనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి జల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. గతంలో 7,924 మంది దివ్యాంగులకు పింఛన్లు మంజూరయ్యాయి. అయితే వారి 2,781 మందికి వైకల్యంలో పలు లోపాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ మేరకు గత నెల 15 నుంచి జిల్లాకు చెందిన పలు ఆసుపత్రుల్లో వారికి తనిఖీలు కొనసాగుతున్నాయి. అయితే నవంబరు నెలకు సంబంధించి పింఛన్లు గతంలో మాదిరిగానే అందించనున్నారు. మృతి చెందిన వారికి తప్ప మిగిలిన పింఛన్‌దారులకు యథావిధిగానే నగదు అందించే చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో 1,40,401 మంది పింఛన్‌దారులకు సంబంధించి రూ.51 కోట్లు విడుదలయ్యాయి.

ఆందోళన వద్దు..

'జిల్లాలో దివ్యాంగ పింఛన్‌దారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. యథావిధిగానే పింఛన్లు అందిస్తాం. వైకల్య పరీక్షలు పూర్తయిన తర్వాత చర్యలు తీసుకుంటాం. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు తనిఖీలు కొనసాగుతాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.' అని డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి తెలిపారు.

ముస్తాబుకు సిద్ధం

- జిల్లాలో వినూత్న కార్యక్రమం
- రాష్ట్రంలో తొలిసారిగా నిర్వహణ
- విద్యార్థుల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ పెంపే లక్ష్యం
- ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో అమలుకు చర్యలు

పార్వతీపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలోని విద్యాలయాల్లో నేటి నుంచి 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. కొద్దిరోజుల కిందట మంత్రి సంధ్యారాణి సాలూరు మండలం కొత్తవలస గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. తాజాగా కలెక్టర్ ఆదేశాలతో ఈ వినూత్న కార్యక్రమం నిర్వహణకు సంబంధించి క్షేత్రస్థాయి సిబ్బంది అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, స్వీయ క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందించడమే లక్ష్యంగా 'ముస్తాబు' అమలు చేయనున్నారు.

ఇదీ పరిస్థితి..

'ముస్తాబు'లో భాగంగా విద్యార్థులు తమ చేతులు, ముఖం పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గోర్లు పెరగకుండా చూడాలి. శుభ్రమైన దుస్తులు వేసుకోవాలి. జుట్టును సరిగా దువ్వుకోవాలి. దీనివల్ల వారు వ్యాధులు బారిన పడకుండా ఉంటారు. ఆరోగ్యకర జీవనశైలికి అలవాటు పడతారు. శారీరక, మానసిక ఉత్సాహం పెరుగుతుంది. ఆలోచన విధానం మారుతుంది. ఏకాగ్రతతో చదవగలుగుతారు. పాఠశాల పరిశుభ్రతలో కీలక పాత్ర పోషిస్తారు. ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.

ఆరోగ్య పరిరక్షణకు దోహదం



'రాష్ట్రంలో తొలిసారిగా జిల్లాలో 'ముస్తాబు' నిర్వహిస్తున్నాం. గిరిజన విద్యార్థుల్లో ఆరోగ్య పరిరక్షణకు ఈ కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుంది. చిన్న వయసులోనే వారికి శుభ్రతపై అవగాహన ఏర్పడుతుంది. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండొచ్చు.' అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

ముస్తాబు కార్నర్...

ప్రతి తరగతి గదిలో ఉపాధ్యాయులు ముస్తాబు కార్నర్ ఏర్పాటు చేస్తారు. అద్దం, టవల్, దువ్వెన, సబ్బు, పౌడర్, కాటుక బొట్టు, నెయిల్‌కట్టర్, హ్యాండ్‌వాష్ , నీరు అందుబాటులో ఉంచుతారు. పరిశుభ్రతను పర్యవేక్షించేందుకు రోజువారి లీడర్ వ్యవస్థ ఉంటుంది. తరగతి గదిలోకి ప్రవేశించే ముందు విద్యార్థులను లీడర్లు తనిఖీ చేస్తారు. పరిశుభ్రతలో విఫలమైన విద్యార్థులతో అక్కడే ముఖం కడిగిస్తారు. తల దువ్వుకునే అవకాశం ఇస్తారు. అనంతరం తరగతిలోని అనుమతి ఇస్తారు. భోజనానికి ముందు కూడా చేతులు పరిశుభ్రత తనిఖీ చేస్తారు. ప్రతి వారం పాఠశాలల్లో పరిశుభ్రత అంశాల్లో ముందుండే విద్యార్థులను ముస్తాబు స్టార్‌గా గుర్తించి సత్కరిస్తారు. జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాల, లీడర్ అవార్డులు ఇస్తారు. లీడర్ల పనిని టీచర్లు గమనించి ప్రశంసించాలి. వారానికి ఒకసారి ఉత్తమ లీడర్లు, ముస్తాబు స్టార్స్‌ను గుర్తించి సర్టిఫికెట్ ఇవ్వాలి.

విజయవంతంగా నిర్వహించాలి

'ముస్తాబు' కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం (మిగతా 8వ పేజీలో...)



మాదకద్రవ్యాల రవాణాను అరికట్టాలి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశం

పార్వతీపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అ క్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో సంతలు జరిగే ప్రదేశాలు, షాపులు వద్ద నిఘా పెంచాలి. మత్తు పదార్థాలు విక్రయించే వారి వివరాలు సేకరించాలి. మారుమూల ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. గంజాయి, నాటుసారా, బాల్య వివాహాలతో కలిగే అనర్థాలు, మహిళల అక్రమ రవాణా వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలి. పలు శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీలు, చైతన్య కార్యక్రమాలు, దాడుల్లో పట్టుకున్న సరుకులపై నివేదిక అందించాలి. మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసే వారికి శిక్షలు పడేలా చర్యలు తీసుకోవాలి.' అని తెలిపారు. జిల్లాలో మహిళలపై నేరాలు, వరకట్న, లైంగిక, ఇతర వేధింపులు జరగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. గత మూడేళ్లలో వరకట్న, ఇతర లైంగిక వేధింపుల కేసులు బాగా తగ్గుముఖం పట్టాయన్నారు. ఎస్పీ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో పోక్సో కేసులు అధికంగా నమోదు అవుతున్నాయన్నారు. కౌన్సిలింగ్ ఇస్తున్నామని, పార్వతీపురం, పాలకొండ, సాలూరులో మూడు శక్తి బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పక్కన ఎస్పీ, జేసీ

వల్లభ్‌భాయ్ పటేల్‌కు ఘన నివాళి

కలెక్టరేట్‌లో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ తదితరులు పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం సర్దార్ సేవలను కొనియాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి హోంశాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేసిన ఉక్కుమనిషి పటేల్ అని తెలిపారు.

తుఫాన్ బాధితులకు ప్రత్యేక సాయం

జిల్లాలో తుఫాన్ బాధితులకు ప్రభుత్వం ప్రత్యేక సహాయాన్ని ప్రకటించిందని కలెక్టర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిలీఫ్ క్యాంపుల్లో తాత్కాలికంగా ఆశ్రయం పొందిన ప్రతి కుటుంబానికి రూ.3 వేలు చొప్పున అందించనున్నట్లు పేర్కొన్నారు. వ్యక్తిగతంగా రూ.1000 చొప్పున గరిష్ఠంగా చెల్లించనున్నట్లు వెల్లడించారు.

జిల్లాకు ప్రత్యేక స్థానం కల్పించడమే లక్ష్యం

జలపాతాల జిల్లాగా పార్వతీపురం మన్యానికి ప్రత్యేక స్థానం కల్పించడమే తన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో మాట్లాడుతూ... సీజన్ స్టార్స్ పేరిట ఈనెల ఒకటో తేదీన సీతంపేట ఎన్టీఆర్ పార్కులో 'విహంగ వీక్షణం చేద్దాం...మన్యం అందాలను తిలకిద్దాం' కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లాలో ప్రకృతి అందాలను పర్యాటకుల చెంతకు తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఎన్టీఆర్ అడ్వంచర్ పార్కులో హాట్ ఎయిర్ బెలూన్ అందుబాటులోకి తెచ్చామని, మెట్టుగూడ జలపాతం వద్ద పిల్లల కోసం స్విమ్మింగ్‌పూల్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించారు. జిల్లాలో అనేక జలపాతాలు ఉన్నాయని, వాటిని పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అవసరమైన స్టాల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

తోటపల్లి గేట్లు మూసివేత

- కోతకు గురైన మట్టికట్టలు, రక్షణ గోడ ప్రాంతం
- ప్రాజెక్టు వైపు ఎవరూ వెళ్లకుండా చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో భారీగా చేరిన వరద కారణంగా తోటపల్లి స్పిల్‌వేకు ఆనుకుని ఉన్న మట్టికట్టలు, ప్రాజెక్టుకు ఇరువైపులా ఉన్న రక్షణ గోడ ప్రాంతాలు కోతకు గురయ్యాయి. గతంలో కొంతమేర రివిట్‌మెంట్ పనులు నిర్వహించారు. అయితే నిధుల సమస్య కారణంగా పనులు అర్ధాంతరంగా నిలిచాయి. ప్రస్తుతం కోతకు గురికావడంతో ప్రాజెక్టు ప్రాంతం గతంలో మాదిరిగానే దర్శనమిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు వైపు ఎవరూ వెళ్లకుండా అధికారులు ప్రధాన గేటుకు తాళం వేశారు. 'వరదల కారణంగా ప్రాజెక్టులో పలు ప్రాంతాలు కోతలకు గురయ్యాయి.. వాహనదారులు, పర్యాటకులు ప్రమాదాలకు గురవకుండా ఉండాలనే ఈ చర్యలు తీసుకున్నాం. అసంపూర్తిగా ఉన్న పనులు నిర్వహణకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు ప్రారంభమవుతాయి.' అని ప్రాజెక్టు జేఈ బి.కిషోర్‌కుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళిలో వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. శుక్రవారం ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి 5,300 క్యూసెక్కులు చేరగా, స్పిల్‌వే గేట్లు నుంచి 3,900 క్యూసెక్కులను దిగువ ప్రాంతాలకు విడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 103.73 మీటర్ల మేర నీటి నిల్వ ఉంది. ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో ప్రాజెక్టులో నీటి నిల్వ చేసేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు.


కోతకు గురైన స్పిల్‌వేకు ఆనుకుని ఉన్న రక్షణ గోడ ప్రాంతం


పర్యాటకులు వెళ్లకుండా ప్రధాన గేటు మూసివేసిన దృశ్యం

దేశ సమైక్యత
పటేల్ ఘనతే
- ఎస్పీ మాధవరెడ్డి
- పార్వతీపురంలో రన్ ఫర్ యూనిటీ
6లో

కేజీబీవీ విద్యార్థినులకు
అస్వస్థత
- వేర్వేరు ఆసుపత్రుల్లో చేరిన నలుగురు బాలికలు
8లో

పెదకుదమలో
గజరాజులు
6లో

సేవలు ఎలా అందుతున్నాయ్!

- అర్జీదారులకు ఐవీఆర్ఎస్ కాల్స్
- ప్రభుత్వ ఉద్యోగుల హడల్

పాలకొండ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులకు ఐవీఆర్ఎస్ కాల్స్ హడలెత్తిస్తున్నాయి. అర్జీదారులకు ప్రభుత్వం నేరుగా ఫోన్ చేసి సమస్యలు, ఉద్యోగుల పని తీరుపై ఆరా తీస్తుండడంతో ఎవరు ఏం చెబుతారోనని ఆందోళన చెందుతున్నారు. అయితే కొంతమంది ఉద్యోగులు మాత్రం ముందస్తుగా అప్రమత్తమవుతున్నారు. వివిధ పనులపై తమ వద్దకు వచ్చే అర్జీదారులతో అసలు విషయం చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి నేరుగా ఫోన్ వస్తే తమ పనితీరుపై సానుకూలంగా సమాధానం చెప్పాలని కోరుతున్నట్టు తెలుస్తోంది. మరికొందరైతే అర్జీదారులకు వారి సమస్యలపై సమాచారం అందిస్తూ.. పనిలో పనిగా తమ పనితీరుపై మంచిగా చెప్పాలని ప్రాధేయపడుతున్నట్టు సమాచారం.

ఇదీ పరిస్థితి..

పాలనలో పారదర్శకత, ఉద్యోగుల్లో జవాబుదారీతనం పెంచి అవినీతిని నిరోధించేందుకు కూటమి ప్రభుత్వం సరికొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా నేరుగా అర్జీదారులతో మాట్లాడి ఉద్యోగుల పనితీరు, వివిధ శాఖల ద్వారా ఎలా సేవలు అందుతున్న విషయాన్ని తెలుసుకుంటోంది. ఈ నేపథ్యంలో వివిధ సమస్యలపై గ్రీవెన్స్‌కు వచ్చే అర్జీదారులు సంతృప్తికరంగా ఉన్నారా? లేరో అని కాల్స్ ద్వారా తెలుసుకుం టున్నారు. అర్జీ పెట్టుకున్న సమయంలో ఉద్యోగులు నుంచి ఎదుర్కొనే ఇబ్బందులపై ఆరా తీస్తున్నారు. అంతేకుండా ఎవరైనా లంచం (మిగతా 8వ పేజీలో...)






ఆన్‌లైన్‌లో పాఠశాలల
సమాచారం
- యూడైస్ ప్లస్‌లో.. ఒకే క్లిక్‌తో సమగ్రమూ..
- దీని నివేదిక ఆధారంగానే కేంద్రం నిధులు
6లో

చికెన్ షాపులకు
కొత్త లైసెన్స్ విధానం
- నాణ్యమైన చికెన్ విక్రయాలకు చర్యలు



ఆన్‌లైన్‌లో పాఠశాలల సమాచారం

- యూడైస్ ప్లస్‌లో.. ఒకే క్లిక్‌తో సమగ్రమూ..
- దీని నివేదిక ఆధారంగానే కేంద్రం నిధులు


పాఠశాలలో అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న ఎంఈవోలు

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థ సమగ్ర సమాచారాన్ని ఒకేచోట నిక్షిప్తం చేసేందుకు పాఠశాల విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఇందుకుగాను యూడైస్‌ప్లస్ (యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్) వెబ్‌సైట్‌ను కేంద్ర మానవ వనరుల శాఖ రూపొందించింది. ఒక్క క్లిక్‌తో ప్రభుత్వపాఠశాలల పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమవుతుంది. పాఠశాలల స్థితిగతులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల సమాచారంతో పాటు మౌళిక వసతులు, డ్రాపౌట్స్ వంటివి స్పష్టంగా తెలుసుకునే వీలుంది. ఇప్పుడు పాఠశాల ప్రధానోపాధ్యాయులు యూడైస్ ప్లస్‌ను అప్‌డేట్ చేసే పనిలో నిమగ్నమయ్యారు. గతంలో యూడైస్ నమోదు మాన్యువల్‌గా ఉండగా 2022-23 నుంచి యూడైస్ ప్లస్‌గా ఆధునీకరించారు. అప్పటి నుంచి కేంద్రప్రభుత్వం వెబ్‌సైట్ ద్వారా సమాచారాన్ని సేకరించి అప్‌డేట్ చేస్తున్నారు. గతంలో ఏడాదికోసారి సమాచారం అప్‌డేట్ చేయగా.. ఇకపై నిరంతరం సాంకేతిక ఆధారంగా సమాచారాన్ని అప్‌డేట్ చేసే అవకాశం ఉంది. పాఠశాలలో మౌలికవసతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మాడ్యుల్స్‌గా.. వెబ్‌సైట్‌ను మూడు భాగాలుగా విభజించి సమాచారం నిక్షిప్తం చేస్తున్నారు. ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయుల నేతృత్వంలో ఈ ప్రక్రియ కొనసాగిస్తున్నారు.

వివరాలు సమగ్రంగా నమోదు..

ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు చదువుకుంటున్న ప్రతి విద్యార్థి వివరాలు వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు నమోదు చేశారు. ఇప్పుడు అప్‌డేట్ అయిన సమాచారం జతచేస్తున్నారు. అలాగే తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు, తాగునీరు తదితర సదుపాయాల వివరాలతో పాటు వాటి స్థితిగతులపై తాజా సమాచారాన్ని పొందుపరుస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వ పరంగా అందుతున్న సౌకర్యాల కల్పనకు యూడైస్ ప్లస్‌లోని వివరాలు కీలకం కానున్నాయి. వెబ్‌సైట్‌లో నమోదైన విద్యార్థులకు యూనిఫాం, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలు తదితర వాటిని అందించనున్నారు.

ప్రతీ విద్యార్థికి ఒక నెంబర్ కేటాయింపు..

యూడైస్ ప్లస్ పోర్టల్ కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తుంది. ప్రతిఏటా అన్ని పాఠశాలల సమగ్ర వివరాలను ప్రధానోపాధ్యాయులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందులో నమోదు చేసిన ప్రతీ విద్యార్థికి ఒక పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్ (పీఈఎన్) కేటాయిస్తారు. దీని ద్వారా ఆ విద్యార్థి దేశవ్యాప్తంగా ఏఏ పాఠశాలల్లో ఏఏ తరగతులు చదివాడు? అనేది తెలుస్తుంది. పదోతరగతి విద్యార్థి బోర్డు పరీక్షలు రాయాలంటే ఇందులో నమోదై ఉండాల్సిందే. అలాగే ఆటోమేటిడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) ప్రతి విద్యార్థికి ఆధార్ కార్డు మాదిరిగానే జారీ చేయాలి. జిల్లాలో 1452 ప్రాథమిక, 319 ప్రాథమికోన్నత, 464 ఉన్నత.. మొత్తం 2,235 పాఠశాలల్లో 2,24,051 మంది విద్యనభ్యసిస్తున్నారు.

తప్పుల్లేకుండా వివరాల నమోదు..



ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలును నమోదు చేసే ప్రక్రియ నిరంతరంగా సాగుతుంది. యూడైస్ ప్లస్‌లో నమోదు చేసినప్పుడు తప్పులు లేకుండా ఉపాధ్యాయులు చూసుకోవాల్సిన అవసరం ఉంది. యూడైస్ ప్లస్ సమాచారం ఆధారంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుంది.

-మాణిక్యంనాయుడు, జిల్లా విద్యాశాఖ అధికారి

చికెన్ షాపులకు కొత్త లైసెన్స్ విధానం

- నాణ్యమైన మాంసం విక్రయాలకు చర్యలు



బొబ్బిలి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ చికెన్ షాపులు వెలుస్తున్నాయి. వీటిలో చాలా వరకు నిబంధనలు పాటించడం లేదు. చికెన్ వ్యాపారాలపై సరైన నియంత్రణ కరువైందన్న విమర్శలు ఉన్నాయి. ఇలాంటి తరుణంలో అక్రమాలను అరికట్టాలన్న లక్ష్యంతో రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ కొత్త లైసెన్సింగ్ విధానానికి శ్రీకారం చుట్టింది.

- ఇక నుంచి ప్రతీ చికెన్ దుకాణానికి లైసెన్స్ తప్పనిసరి. కొత్తగా ఈ-లైసెన్సింగ్ విధానాన్ని అమలు చేయనున్నారు. దీనివల్ల కోళ్లను ఎక్కడ నుంచి ఎక్కడికి సరఫరా చేస్తున్నారన్న మొత్తం ప్రక్రియను పర్యవేక్షించే అవకాశం ఉంది. కోళ్ల సరఫరా ట్రాక్ వ్యవస్థపై పట్టు, పర్యవేక్షణ కోసం కొత్త విధానాన్ని రూపొందించారు. దీనివల్ల చనిపోయిన కోళ్లను, ఇతర జంతువులను మాంసంగా అమ్మడం అరికట్టవచ్చని చెబుతున్నారు.
- స్వయం ఉపాధి కోసం కోళ్ల ఫారాలను, చికెన్ సెంటర్లను నడుపుకుంటున్న వారిలో కొందరు అక్రమాల బాట పడుతున్నారు. కోళ్ల మాంసం బరువు ఎక్కువగా తూగాలన్న దురుద్దేశంతో స్టెరాయిడ్స్ వినియోగిస్తున్నారన్న ఆరోపణలు కోకొల్లలు. అయితే ఇకనుంచి హోటల్స్, రెస్టారెంట్లు నడుపుకునేవారు ప్రభుత్వం ఆమోదించిన చికెన్ షాపుల్లోనే మాంసం కొనుగోలు చేయాలన్న నిబంధనను కఠినతరం చేయనున్నారు.
- చికెన్ షాపుల్లోని వ్యర్థాలను చేపలకు ఆహారంగా వినియోగిస్తున్నారు. దీన్ని నియంత్రించాలని రాష్ట్ర మాంసాభివృద్ధి సంస్థ కార్యాచరణను అమలు చేయనున్నది. చేపల చెరువుల్లో కోళ్లమాంసం వ్యర్థాలను వేయడం వల్ల నీరు కలుషితమై అనారోగ్యాలకు కారణమవుతోందని ప్రజలు, సామాజిక కార్యకర్తలు ఆందోళన చెందుతున్నా ఆ ప్రక్రియ సాగుతూనే ఉంది. ప్రజారోగ్యాన్ని పరిరక్షించే క్రమంలో కోళ్ల ఫారాలు, చికెన్ సెంటర్లలో వ్యర్థాలను సురక్షితంగా పారవేయాలని కొత్త విధానంలో నిర్దేశిస్తున్నారు.

చికెన్ సెంటర్ల నిర్వహణలో విధివిధానాల్లేవు..



జనావాస ప్రాంతాలలో విచ్చలవిడిగా చికెన్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. పాఠశాలల కూడళ్లలో కూడా మాంసపు దుకాణాల్లో కళేబరాలను వేళాడదీస్తున్నారు. ఇలాంటి దుకాణాలన్నిటినీ ఓ ప్రత్యేకమైన చోట ఏర్పాటు చేయాలి. పరిశుభ్రంగా ఉండేందుకు వాటికి మెస్‌లు ఇతరత్రా ఏర్పాటు చేయాలని అధికారులను కోరుతున్నాము. ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. ఇకనైనా చికెన్ సెంటర్లను ఆరోగ్యకరమైన వాతావరణంలో నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేయాలి.

-పుల్లెల శ్రీనివాసరావు, బొబ్బిలి

పంట కాలువను కప్పేశారు

- రోడ్డు పక్కనే దర్జాగా ఆక్రమణ

భోగాపురం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఓపక్క అంతర్జాతీయ గ్రీన్ పీల్డ్ ఎయిర్ పోర్టు.. మరోవైపు ఏర్పాటు కాబోతున్న బీచ్ కారిడార్‌తో భోగాపురం భూమి ధరలు అమాంతం పెరిగి పోయాయి. దీంతో ఆక్రమణదారులు స్థలం కనిపిస్తే పాగా వేసేస్తున్నారు. వాగులు, వంకలు, చెరువులు.. ఇలా దేన్ని వదలడం లేదు. ఇదంతా అధికారులు చూసినా తమకెందుకులే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ఏవరైనా ఫిర్యాదు చేస్తే చూద్దాములే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఒకవేళ ఆక్రమణలు గుర్తించినా తూతూ మంత్రంగా బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. మళ్లీ ఆవైపే చూడడంలేదు. మండలంలోని ముక్కాం ఆర్అండ్‌బీ రహదారిని ఆనుకుని రామచంద్రపేట బస్‌స్టాప్ సమీప కాలనీ వద్ద పంటకాలువను కొందరు పూర్తిగా పూడ్చివేసి నిర్మాణాలు చేపడుతున్నారు. పంట కాలువలో నీరు ప్రవహించి సమీప చెరువులోకి చేరేది. ఇప్పుడు అలాంటి కాలువను ఆక్రమణదారులు చదును చేశారు. కాంక్రీట్ స్తంభాలు వేసి నిర్మాణాలు చేపడుతున్నారు. రహదారిని ఆనుకుని ఉన్న కాలువను పూడ్చేసినా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఈ ఆక్రమణలకు పాల్పడుతున్నది వైసీపీకి చెందిన కొందరు నాయకులే అన్న విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై ముక్కాం వీఆర్వో ఆర్.నవీన్‌ను వివరణ కోరగా ఆక్రమణ తన దృష్టికి వచ్చిందని, పరిశీలించామని, చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పంట కాలువ పూడ్చేసి నిర్మాణం చేపడుతున్న దృశ్యం

దేశ సమైక్యత పటేల్ ఘనతే

- ఎస్పీ మాధవరెడ్డి
- పార్వతీపురంలో రన్ ఫర్ యూనిటీ


రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత, సమగ్రతకు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ ఎనలేని కృషి చేశారని ఎస్పీ ఎస్.వి.మాధవరెడ్డి కొనియాడారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భం గా పార్వతీపురంలో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ పాల్గొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పటేల్ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో వల్లభాయ్ పటే ల్ కీలక పాత్ర పోషించారన్నారు. ఐక్య భారత్ నిర్మాణానికి అలుపెరగని కృషి చేసి సమగ్ర భారతదేశానికి తుదిరూపు ఇచ్చారన్నారు. దేశానికి అందించిన సేవలకు గానూ ఆయన జయంతిని రాష్ట్రీయ ఏక్తా దివస్‌గా 2014 నుంచి నిర్వహిస్తున్నామన్నారు. ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి, సీఐలు రమణమూర్తి, మురళీధర్, రంగనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే దేశాభివృద్ధికి కృషి చేయాలి..

- ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ పద్మనాభరాజు

డెంకాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ఐక్యతతోనే దేశాభివృద్ధికి కృషి చేయాలని ఐదో పోలీసు బెటాలియన్ కమాండెంట్ సీహెచ్‌వీఎస్ పద్మనాభరాజు కోరారు. శుక్రవారం చింతలవలస వద్ద గల ఐదో పోలీసు బెటాలియన్ ఆవరణలో పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా ఏక్తాదివస్ యూనిట్ ఫర్ రన్ కాండిల్ ర్యాలీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ ఐక్యతతో ముందుకు సాగి పోలీసు వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ ఎస్.బాపూజీ, ఎం.గోపాలకృష్ణ, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రన్‌ఫర్ యూనిటీ కార్యక్రమంలో పాల్గొన్న కమాండెంట్ పద్మనాభరాజు

పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ

- సాథీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ



సాథీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేసేందుకు సాధీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ రూపొందించామని ఎస్పీ ఎఆర్ దామోదర్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో టూటౌన్ సీఐ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూపొందించిన సాధీ వెబ్‌సైట్ సోషల్ మీడియా ఫ్లాట్‌ఫామ్‌ని ఎస్పీ ఎఆర్ దామోదర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు ఎక్కువగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ వినియోగిస్తుండడంతో పోలీసు సేవలను మరింత చేరువ చేస్తున్నామన్నారు. సాధీ ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్, వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్స్ ప్రారంభించామన్నారు. టూటౌన్ పోలీసులు రూపొందించిన ఈ ప్లాట్‌ఫామ్ అనుసరించడం ద్వారా పోలీసులు చేపట్టే అవగాహన కార్యక్రమాలు, సలహాలు, సూచనలు, హెచ్చరికలు, చట్టాలు వల్ల కలిగే ప్రయోజనాలు ప్రజలు సులభంగా తెలుసుకోవచ్చునన్నారు. వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిన సీఐ శ్రీనివాసరావును ఎస్పీ అభినందించారు. ఇదే తరహాలో జిల్లాలోని అన్ని పోలీసుస్టేషన్‌ల్లో ఈ ప్లాట్‌ఫామ్స్‌ని ప్రారంభించి, పోలీసు సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శ్రీనివాసరావు, ఏవీ లీలారావు, ఈ నర్సింహమూర్తి పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం

- మొంథా తుఫాన్‌తో దెబ్బతిన్న పంటల పరిశీలన


విజయనగరం రూరల్: కొండకరకాంలో పాడైన వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

జిల్లాలో మొంథా తుఫాన్ వల్ల పంటలు నష్టపోయిన రైతులను ఆదుకుంటామని అధికారులు, ప్రజాప్రతినిధులు తెలిపారు. శుక్రవారం జిల్లాలో తుఫాన్ వల్ల దెబ్బతిన్న ఆహార, వాణిజ్య పంటలను, ఇళ్లను పరిశీలించారు.

బాధితులకు న్యాయం చేయాలి..

విజయనగరం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకరకాంలో పంట పొలాలను ఎమ్మెల్యే అదితి గజపతి రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటిస్తున్నారని, రైతులు వారికి సమగ్ర సమాచారాన్ని అందజేయాలని కోరారు. అలాగే విజయనగరంలోని అశోక్ నగర్‌లో దెబ్బతిన్న పది ఇళ్లను ఎమ్మెల్యే పరిశీలించారు. బాధితులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తూర్పుకాపు కార్పొరేషన్ చైర్‌పర్సన్ పాలవలస యశస్వి తదితరులు పాల్గొన్నారు.

నేల పడిపోయిన వరి పనలు కట్టలుగా కట్టుకోవాలి..


వేపాడ: సోంపురంలో పడిపోయిన వరి పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వేపాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో నేల పడిపోయిన వరి పనులను రైతులు నిలబెట్టి కట్టలు కట్టి కాపాడుకోవాలని విజయనగరం వ్యవసాయ కేంద్రం శాస్త్రవేత్త తేజేశ్వరరావు సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో తుఫాన్ ప్రభావంతో నేల పడిపోయిన పంటలను మండల వ్యవసాయాధికారులతో పాటు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలంలో నీరు లేకుండా పూర్తిగా తీసేయాలన్నారు.తర్వాత పొలంలో పడిపోయిన వరి చేనును నిలబెట్టి దుబ్బులను వీలైనంత త్వరగా కట్టలు కట్టి నిలబెట్టాలన్నారు.దీంతో గింజలు రంగు మారకుండా, విరిగిపోకుండా కాపాడుకోవచ్చని తెలిపారు. ఏవో స్వాతి మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లో పంట నష్టాలను అంచనా వేస్తామని చెప్పారు.

జలదిగ్బంధంలో కార్యాలయాలు..


జలదిగ్బందంలో ఉన్న రేగిడికి వెళ్లే రహదారి

రేగిడి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకులోవ గెడ్డకు వరద నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో వెంకమ్మపేట, రేగిడి గ్రామాలకు వెళ్లే రహదారులు మూడు రోజులుగా జల దిగ్బంధంలో ఉండడంతో ఆయా రహదారులు అధికారులు ముందుస్తు జాగ్రత్తగా రాకపోకలు నిలిపివేశారు. రేగిడిలోని ప్రభుత్వ కార్యాలయాలు జలదిగ్బంధంలో ఉండడంతో కార్యకలాపాలకు అంతరాయం కలుగుతోంది. శుక్రవారానికి కూడా గెడ్డ నుంచి వరద రెండు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో ఆయా రూట్లలో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈనేపథ్యంలో రేగిడి, అమదాలవలస, తునివాడ, వెంకమ్మపేట, కందిశ, పాతచెలిగానవలస తదితర ఏడు ఎనిమిది గ్రామాల ప్రజలు చుట్టు తిరిగి గమ్యస్థానాలకు చేరుకోవల్సివస్తోందని వాపోతున్నారు. ఉన్నతపాఠశాల ప్రాంగణం చుట్టూ వరదనీరు నిల్వఉండడం, గెడ్డఅవతల గ్రామాల విద్యార్థులకు స్కూల్‌కు అనుమతించలేదని ఎంఈవో వరప్రసాదరావు తెలిపారు. పశువైద్యకేంద్రం, అంగన్‌వాడీకేంద్రం తెరచుకోలేదు. రేగిడి పీహెచ్‌సీ చుట్టూ నీరుచేరడంతో సేవలందక రోగులు అగచాట్లకు గురవుతున్నారు.

పెదకుదమలో ఏనుగులు


పెదకుదమ - పరజపాడు గ్రామాల మధ్య ఉన్న ఏనుగులు

జియ్యమ్మవలస, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూడు రోజులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. కుదమ పంచాయతీ పెదకుదమలో శుక్రవారం ఉదయం ఏనుగులు సంచరించాయి. గ్రామ సమీపంలో పశువులశాలలు వద్ద కొంత సమయం సంచరించి దగ్గరలోని చెరువులోకి ఏనుగులు దిగాయి. మధ్యాహ్నం పెదకుదమ నుంచి పరజపాడు వైపు ఏనుగులు వెళ్లాయి. ప్రస్తుతం పెదకుదమ, పరజపాడు గ్రామాల మధ్య అరటి తోటల్లో ఉన్నాయి. ఏనుగుల వల్ల అరటి, వరి, చెరకు, బొప్పాయి పంటలకు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాటిని తక్షణమే తరలించే ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. అయితే గ్రామ సమీపంలోకి ఏనుగులు వచ్చేసరికి ఎక్కువ మంది వాటిని చూసేందుకు దగ్గరకు వెళుతున్నారు. దానివల్ల ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు. ఏనుగులు పర్యవేక్షణకు సహకరించాలని వారు కోరారు.

స్థల సేకరణలో జాప్యం

● రెండూ ఒకే చోట ఉండడంతో ఆందోళన చెందుతున్న వ్యాపారులు ● ఇదీ విజయనగరంలో రైతుబజారు పరిస్థితి


పాత మహారాజా ఆసుపత్రి గేటు వద్ద కూరగాయలు విక్రయిస్తున్న రైతులు

విజయనగరం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో ఎంఆర్‌హెచ్ రైతుబజారు కోసం స్థల సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో రైతు బజారు పాత మహారాజ ఆసుపత్రి ఆవరణలో ఉండేది. ఆ స్థలం మాన్సాస్‌కి చెందినది కావడంతో దానిని అక్కడ నుంచి తొలగించి ఈ ఏడాది జూలైలో రింగురోడ్డులోని దాసన్నపేట రైతు బజారులో విలీనంచేశారు. దీంతో ఒక పక్క దాసన్నపేట రైతుబజారుకు, మరో పక్కన ఎంఆర్‌హెచ్ రైతు బజారు రైతులకు స్థలం కేటాయించారు. ఇక్కడ ఇద్దరు ఎస్టేట్ ఆఫీసర్లు, ఇద్దరు సూపర్‌వైజర్లు, నలుగురు గార్డులు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకేచోట రెండు రైతుబజార్లు నిర్వహణ వల్ల వ్యాపారాలు జరగడంలేదని రైతులు, వివిధ స్టాల్స్ వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఎంఆర్‌హెచ్ బజారు తొలగించిన తర్వాత నగరంలోని ఎన్‌సీఎస్ రోడ్డులోని రామారాయుడు రోడ్డుతోపాటు పలుచోట్ల స్థల సేకరణ కోసం పరిశీలించినా కొలిక్కిరాలేదు. అయితే ఒకే ప్రాంతంలో రెండుబజార్లు ఉండడం వల్ల వ్యాపారాలు జరగడం లేదని కొందరు రైతులు పాత మహారాజా ఆసుపత్రి గేటు వద్ద కూరగాయలు విక్రయిస్తున్నారు. వర్షాకాలం ఆ ప్రాంతంలో కూరగాయల విక్రయానికి వీలుపడడం లేదు. ఒక వైపు రైతుబజారులో స్టాల్స్ కాపాడుకోవడానికి నెలవారీ అద్దెలు చెల్లిస్తూ మరోవైపు రోడ్లపైనే కూరగాయాలు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం విజయనగరంలోని మూడు రైతు బజార్లను విస్తరించకపోగా, ఒకే చోట రెండు రైతు బజార్లు నిర్వహించడం ఎంతవరకూ సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు. తొలగించిన ఎంఆర్‌హెచ్ రైతుబజారుకు ప్రధాన కూడలిలో స్థల సేకరణ చేయాలని రైతులు, వ్యాపారులు కోరుతున్నారు.

ఆకతాయికి దేహశుద్ధి

● మహిళల స్నానాల గదుల్లోకి చూసిన పెరుమళ్ల వాసి

● ద్వారకాతిరుమల శ్రీవారి కల్యాణకట్టలో ఘటన ● పోలీసులకు అప్పగింత


ద్వారకాతిరుమల దేవస్థానంలో ఆకతాయిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ద్వారకాతిరుమల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల శ్రీవారి కల్యాణ కట్ట(కేశఖండనశాల)లోని స్నానాల గదుల్లో మహిళా భక్తులు వస్త్రాలు మార్చుకుంటున్న సమయంలో వెంటిలేటర్ నుంచి తొంగిచూస్తున్న తెర్లాం మండలం పెరుమాళ్లకు చెందిన ఓ ఆకతాయిని దేవాలయ సెక్యూరిటీ సిబ్బంది పట్టుకుని దేహశుద్ధిచేసి పోలీసులకు అప్పగించారు.ద్వారకాతిరుమల పోలీసులు ఆకతాయిపై కేసు నమోదు చేశారు. తెర్లాం మండలం పెరుమాళ్ల గ్రామానికి చెందిన మైలపల్లి పైడిరాజు కొద్దిరోజులుగా కేశఖండనశాల ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్నాడు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది అతనిపై నిఘాపెట్టారు. ఈక్రమంలో శుక్రవారం ఉదయం కేశఖండనశాల ప్రాంతంలో ఉన్న స్నానాల గదుల వెంటిలేటర్ నుంచి తొంగిచూస్తుండటాన్ని సెక్యూరిటీ గమనించారు. గత శనివారం కూడా పైడిరాజు ఇలా చూడటాన్ని మహిళా భక్తులు గమనించి భయాందోళనలతో అరచి ఫిర్యాదుచేశారు. దీంతో సెక్యూరిటీ పైడిరాజుపై నిఘపెట్టారు. ఈక్రమంలో శుక్రవారం కల్యాణకట్ట వెనుక ప్రాంతానికి వచ్చిన పైడిరాజును ఓ క్షురకుడు గమనించి దేవస్థానం, సెక్యూరిటీ సిబ్బందికి తెలిపాడు. ఇదే సమయంలో అతను వెంటిలేటర్ నుంచి చూడటాన్ని గమనించిన సెక్యూరిటీ అతడిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అతడి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని పొటోలు, వీడియోలు ఉన్నాయేమోఅని పరిశీలించారు. తాను కేవలం చూస్తున్నానని పొటోలు, వీడియోలు తీయలేదని ఆకతాయి వారికి వివరించాడు. అతడి చేతులు కట్టి బైక్‌పై స్థానిక పోలీసులకు అప్పగించారు. అనంతరం దేవాలయ అధికారులు ఆ వెంటిలేటర్‌లను పూడ్చించి వేశారు. దేవస్థానం సెక్యూరిటీ ఆఫీసర్ పైడేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు ఇళ్లకు పాక్షిక నష్టం

ఎస్.కోట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో గల చిట్టంపాడు గిరిశిఖర గ్రామంలో వర్షాలకు ఏడు గిరిజన కుటుంబాల ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని ఆర్ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పది కిలోమీటర్లు నడిచి గ్రామానికి చేరుకొని గిరిజనుల సమస్యలు తెలుసుకోవడంతోపాటు వారి ఇళ్లు పరిశీలించారు. తమ నివేదికను తహసీల్దార్‌కు అందిస్తామని తెలిపారు.

బాలికలను జాగ్రత్తగా చూసుకోవాలి

గుర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): బాలికలపై నిర్లక్ష్యం వహించరాదని, ఎప్పటికప్పుడు జాగ్రత్తగా చూసుకోవాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి డాక్టర్ ఎ.కృష్ణప్రసాద్ కోరారు. శుక్రవారం గుర్ల కేజీబీవీ పాఠశాలను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఇటీవల విద్యుఘాతానికి గురైన గదిని పరిశీలించి, విద్యుత్ ఏఈకి వివరాలు అడిగితెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, విద్యుత్‌అసిస్టెంట్ ఇంజనీర్ నారమనాయుడు, విద్యుత్ సేఫ్టీ మేనేజర్, కేజీబీవీ ప్రిన్సిపాల్ జానకి పాల్గొన్నారు. కాగా కస్తూర్బాపాఠశాలలో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని కేజీబీవీ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి కోరారు. గుర్ల కేజీబీవీలో ఇటీవల అస్వస్థతకు గురైన విద్యార్థినులను శుక్రవారం పరామర్శించారు.

స్తంభాలు వేసి.. తాడు ఏర్పాటుచేసి

● గాదెల్లోవా వద్ద తాత్కాలిక వంతెన నిర్మాణానికి యువకుల చర్యలు


తాత్కాలిక వంతెన నిర్మిస్తున్న యువకులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలబొడ్డవర పంచాయతీ పరిధిలో గల గాదెల్లోవా గ్రామ యువకులు గెడ్డపై స్తంభాలు వేసి, తాడు ఏర్పాటుచేసి తాత్కాలికంగా వంతెన నిర్మాణానికి చర్యలు ప్రారంభించారు. ఇక్కడ ఉండే వంతెన గతంలో వర్షాలకు కొట్టుకుపోయింది. తరువాత అధికారు లు చర్యలు తీసుకోకపోవడంతో గ్రామస్థులు విద్యుత్ స్తంభాలు వేసుకొని రాకపోకలు సాగించేవారు.ఈవిషయం తెలుసుకున్న అధికారులు గ్రామా నికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. కాగా ఇటీవల తుఫాన్ సమయంలో కురిసిన భారీవర్షాలకు ఆ స్తంభాలు కొట్టుకుపోయాయి. దీంతోగ్రామంలో నివాసముంటున్న 25కుటుంబాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించకపోవడంతో మరోసారి గిరిజన యువత ముందుకొచ్చారు. గ్రామం నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు అనువుగా మరోసారి విద్యుత్ స్తంభాలతో తాత్కాలిక వంతెన ఏర్పాటుచేస్తున్నారు.

సన్యాసమ్మ కుటుంబానికి న్యాయం చేయాలి

విజయనగరం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని 38వ డివిజన్ పరిధిలోని గోకపేటలో తుఫాన్ వల్ల గోడ కూలిపోయిన సంఘటనలో రెయ్యిసన్యాసమ్మ(74)మృతిచెందడం బాధకరమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా అధికారులు, తహసీల్దార్‌తో కూడా ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. బాధిత కుటుంబానికి తక్షణమే న్యాయం చేయాలని కోరారు. అనంతరం సన్యాసమ్మ కుటుంబ సభ్యులతో కూడా ఎమ్మెల్యే మాట్లాడారు.

సన్న రకాలు సాగుచేయండి

● రాష్ట్ర వ్యవసాయ పరిశోధన సంచాలకుడు సత్యనారాయణ

డెంకాడ, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలను అధిగమించి అధిక దికుబడులు సాధించేందుకు సన్నరకాలను రైతులు సాగుచేయాలని రాష్ట్ర వ్యవసాయ పరిశోధనా సంచాలకుడు డాక్టర్ పీవీ సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం డెంకాడలో కేవీ సూర్యనారాయణ పాణిరాజు పొలంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులు ప్రకృతి వైపరీత్యాలను అధిగమించేందుకు వైపరీత్యాలను తట్టుకొని చిరుసంచుల రకాలను శాస్త్రవేత్తలు రూపొందించి అందించాలని తెలిపారు. మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన రైతుల నివేదికను ఉన్నతాధికారులకు పంపించి వారికి న్యాయం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సహాయ పరిశోధన సంచాలకుడు సీహెచ్ ముకుందరావు, ఏరువాక కేంద్రంకోఆర్డినేటర్ కె.లక్ష్మణ్, విజయనగరం వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త ఎంఎంటి. శ్రీనివాసరావు, శాస్త్రవేత్త అనూరాధ, ఏవో పి.సంగీత, ఏఈవో రామకోటి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు?

నెల్లిమర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):సమస్యలు పరిష్కారం కాని సమావేశాలు ఎందుకు నిర్వహిస్తున్నారని పలువురు కౌన్సిలర్లు నిలదీశారు. నగరపంచాయతీ అభివృద్ధి విషయంలో టీడీపీ, వైసీపీ కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చైర్‌పర్సన్ బంగారు సరోజిని అధ్యక్షతన శుక్రవారం నెల్లిమర్లనగర పంచాయతీ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా సాగింది. తొలుత టీడీపీ కౌన్సిలర్ కింతాడ కళావతి మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశానికి సమోస, టీ తాగడానికి వస్తున్నాం తప్ప వార్డుల్లో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని పరిష్కారానికి నోచుకోలేదని అసహనం వ్యక్తంచేశారు. టీడీపీ కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ మాట్లాడుతూ పాలకవర్గానికి ఎన్నిక జరిగినప్పటి నుంచి ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సభ్యుల మధ్య వాగ్వాదం వల్ల చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని సమావేశం ముగిసిందని ప్రకటించారు. ఏజెండాలోని అంశాలన చర్చించకుండానే సమావేశాన్ని ముగించారు. సమావేశంలో కమిషనర్ టి.జయరాం, వైస్ చైర్మన్ కారుకొండ కృష్ణ పాల్గొన్నారు.

నీటి నాణ్యతపై పరీక్షలు

భోగాపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): భోగాపురం ఎస్సీబీసీ కాలనీలో ఎంపీడీవో డీడీ స్వరూపరాణి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వైకుంఠనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం నీటి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. ఇటీవల మొంథా తుఫాన్ వల్ల కురిసిన వర్షాల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా రక్షిత నీటిట్యాంకులు, బోర్లు, తాగునీరు సరఫరాకు సంబంధించి అన్నివనరుల్లో క్లోరినేషన్‌చేసి నీటి నాణ్యతను పరీక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గాయిత్రి, పంచాయతీ కార్యదర్శి జయమ్మ, తేజ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి నివాళి

శృంగవరపుకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎస్.కోటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వేణుగోపాల్‌కు గ్లోరి అవార్డు

రాజాం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచరాం జడ్పీ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు పందూరు వేణుగోపాల్‌కు నేషనల్ గ్లోరి అవార్డు దక్కింది.రామభద్రపురానికి చెందిన కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సెంటర్ ఈ అవార్డుకు వేణుగోపాల్‌ను ఎంపికచేసింది. విద్యార్థుల్లో శాస్త్రీయదృక్పథాన్ని పెంపొందించడంతో పాటు సైన్స్ ప్రాజెక్టులు రూపొందిస్తూ పలు జాతీయఅవార్డులు కైవసం చేసుకోవడంతో ఈఅవార్డు ఇవ్వనున్నట్లు సొసైటీ ప్రతినిధులు తెలియజేశారని వేణుగోపాల్ తెలిపారు.

ఇళ్లు రిజిస్ట్రేషన్ చేయాలి

శృంగవరపుకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):ఎస్.కోటలో సర్వేనెంబర్ 147లో పేదలకు పంపిణీచేసిన పట్టాల్లో నిర్మించుకున్న ఇళ్లను రిజిస్ట్రేషన్‌చేయాలని జనసేన నాయకుడు ఒబ్బిన సన్యాసినాయుడు కోరారు.ఈ మేరకు శుక్రవారం ఎస్.కోట సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సన్యాసినాయుడు మాట్లాడుతూ ఇక్కడ నిర్మించిన ఇళ్లకు సంబంధించిబ్యాంకు రుణాలకోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్ రిజిస్ట్రేషన్ చేయాలని ఏడాదిగా వేడుకుంటున్నా స్పందించడంలేదని తెలిపారు.

వ్యాపారవేత్తలుగా మారాలి

నెల్లిమర్ల, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): యువత వ్యాపారవేత్తలుగా మారి మరికొంతమందికి ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే లోకంనాగమాధవి కోరారు. శుక్రవారం నెల్లిమర్ల వేణుగోపాలపురం కాలనీలో వాటర్ ప్లాంట్‌నుఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అవనాపు విక్రమ్, చనమల్ల వెంకటరమణ, టీడీపీ నాయకులు సువ్వాడ రవిశేఖర్, లెంక అప్పలనాయుడు, ఆల్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలు చేయాలి

రాజాం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మోదీ అవలంబిస్తున్న కార్మికవ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులంతా ఐక్య పోరాటాలు నిర్వహించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఉల్లాకుల నీలకంటేశ్వరయాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాజాంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావదినోత్సవం పురస్కరించుకుని ఆ సంఘ జెండాను ఆవిష్కరించారు కార్యక్రమంలో సీపీఐ నాయకులు కనకరాజు, తౌడు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు ఎంపిక

గంట్యాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): గంట్యాడ జడ్పీపాఠశాలలో డివిజన్ స్థాయి పాఠశాల క్రీడాపోటీలకు శుక్రవారం ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. అండర్ -14,17 బాల,బాలికలను యోగా, చెస్ పోటీలకు విద్యార్థులను ఎంపికచేశారు. తొలుత పోటీలను హెచ్‌ఎం అలమండ ఝాన్సీ ప్రారంభించారు. అనంతరం 11 మండలాలు నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనగా ఎంపికలు చేపట్టారు. జిల్లాస్థాయి నెట్ వాలీబాల్ పోటీలకు ఎంపిక చేసే ప్రక్రియ కూడా నిర్వహించారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వ్యాయామ ఉపాధ్యాయుడు పీవీఎస్‌ఎన్ రాజు తెలిపారు.

హక్కుల కోసం తెలుసుకోవాలి

గంట్యాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తమ హక్కులు, విధులను తెలుసుకోవాలని తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి తెలిపారు. శుక్రవారం రాత్రి గంట్యాడ ఎస్సీ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సాయి కృష్ణ మాట్లాడుతూ హక్కులతోపాటు చట్టాలను కూడా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోని ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన రాష్ట్రానికి పెద్ద విపత్తు

● చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు

చీపురుపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):గత ఐదేళ్లపాటు జగన్ అందించిన పాలనే రాష్ట్ర ప్రజలకు పెద్ద విపత్తు వంటిదని, భగవంతుని దయవల్ల ఆ ప్రమాదం నుంచి ప్రజలు బయటపడ్డారని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మొంథా తుఫాన్ పరిణామాలపై జగన్, ఆయన పత్రికలు చేస్తున్న వ్యాఖ్యలపై, తుఫాన్ చంద్రబాబు సృష్టించినదేనన్న జగన్ వ్యాఖ్యలపై కళా మండిపడ్డారు. 16 నెలల్లో 16 తుఫాన్లు వచ్చాయని చెబుతున్న జగన్‌కి వాతావరణశాఖ ప్రత్యేకంగా కబురు పంపించిందా అన్ని కళా ప్రశ్నించారు. ఐదేళ్ల పాలనతో ప్రజలు అతి పెద్ద విపత్తును ఎదుర్కొన్నారని, చివరికి ఆయనను ఇంటి ముఖం పట్టించి సుఖంగా ఉన్నారని పేర్కొన్నారు. ఉచిత పంటల బీమా పథకాన్ని గతంలో టీడీపీ ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేసిందని, జగన్ ప్రభుత్వం దాన్ని నిర్వీర్యంచేసిందని కళా విమర్శించారు.తాజా విపత్తులో కూడా జగన్‌రెడ్డి బెంగళూరు ప్యాలెస్‌లో కునికారే తప్ప బాధితులను పరామర్శించలేదని ఆరోపించారు. తుఫాన్ బాధితులను ఆదుకోడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సిద్ధంగా ఉందని తెలిపారు.

కోనాడలో ఎమ్మెల్యేకు నిలదీత


లోకం నాగమాధవిని నిలదీస్తున్న కోనాడ గ్రామస్థులు

పూసపాటిరేగ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో కోనాడలో నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాదవికి శుక్రవారం గ్రామస్థులు నిలదీశారు. తుఫాన్ బాధిత మత్యకార కుటుంబాలకు అందజేసే బియ్యం పంపిణీకి ఆమె వచ్చారు. అయితే మత్యకారభరోసా అందిన 27కుటుంబాలతోపాటు యాతపేటలో 16 తుఫాన్ బాధిత కుటుంబాలను మాత్రమే గుర్తించడంపై గ్రామస్థులు పంపిణీ చేయకుండా అడ్డుకొన్నారు. తుఫాన్ వల్ల చిరువ్యాపారులు, మిగిలిన మత్యకార కుటుంబాలు, దినసరి కూలీలు నష్టపోయామని, హుద్‌హుద్‌లో ఇచ్చేవిధంగా అన్ని రేషన్‌కార్డులకు అందజేయాలని గ్రామస్థులు కోరారు.అలాగే యాతపేటలో అన్ని కుటుంబాలు తుఫాన్‌కు ప్రభావితంకాగా 16 కుటుంబాలనే ఏవిధంగా గుర్తించారని ఎమ్మెల్యేను స్థానికులు నిలదీశారు.కూటమి ప్రభుత్వంలో ఉండి టీడీపీ వారిని వదిలివేసి, వైసీపీ వారిని అక్కున చేర్చుకొని వారు చెప్పినట్లే వింటున్నారని కొందరు టీడీపీ కార్యకర్తలు ప్రశ్నించారు. దీంతో పంపిణీని నిలిపివేసి ఎమ్మెల్యే వెనుతిరిగారు. కాగా ఇప్పటికే సుమారు 19 వందల మత్యకారకార్డులకుబియ్యం పంపిణీకి జాబితా వచ్చిందని, మండలంలోని మూడు వేలకుపైబడి ఉన్న మత్యకార కుటుంబాలకు అందజేయాలని నివేదికలు ఉన్నతాధికారులకు పంపగా వారికి కూడా పంపిణీ చేసేందుకు అధికారులు సమాయత్తం చేస్తున్నారని తహసీల్దార్ ఎస్‌వీ రమణ తెలిపారు.

మత్స్యకారులందరికీ సరుకులు

● మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు


రాంసుందర్ రెడ్డికి సమస్యను వివరిస్తున్న బంగార్రాజు

భోగాపురం, అక్టోబరు31(ఆంధ్రజ్యోతి): కార్డులున్న మత్స్యకారులందరికీ బియ్యంతోపాటు నిత్యావసర సరుకులు ఉచితంగా అందజేయాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినట్లు మార్క్‌ఫెడ్ చైర్మన్, నెల్లిమర్ల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. మొంథా తుఫాన్ నేపథ్యంలో మత్స్యకారులకు ప్రభుత్వం 50 కేజీల బియ్యంతోపాటు పప్పు, ఆయిల్, పంచదార, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు నిత్వసర సరుకులు పంపిణీచేస్తోంది. అయితే భోగాపురం, పూసపాటిరేగ మండలాల పరిధిలోగల తీరప్రాంత గ్రామాల్లో 6800 రేషన్‌కార్డుదారులు ఉండగా 3953 కుటుంబాలకుమాత్రమే బియ్యంతోపాటు సరుకులు మంజూరయ్యాయి. ఈనేపథ్యంలో భోగాపురం, పూసపాటిరేగ మండలాలకు చెందిన పతివాడ తమ్మునాయుడు, ఆకిరిజగన్, తదితరనాయకులతో కలిసి బంగార్రాజు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ రాంసుందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో కలెక్టర్ కార్డులు ఉన్న అందరికీ సరుకులు అందజేయాలని ఆదేశించాని బంగార్రాజు తెలిపారు.

కార్మిక హక్కులపై దాడులు ఆపాలి

రాజాం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షకుల హక్కులపై ప్రభుత్వం చేస్తున్న దాడులను ఆపాలని, ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. శుక్రవారం రాజాంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో మాట్లాడుతూ 15 ఏళ్లుగా కార్మికుల కనీసవేతనాల సవరణ జరగలేదని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ఏపీఆర్డీసీ డైరెక్టరుగా అప్పలనాయుడు

విజయనగరం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని శాంతినగర్‌కు చెందిన కెల్ల అప్పలనాయుడిని ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పోరేషన్(ఏపీఆర్‌డీసీ) డైరెక్టరుగా నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదలచేసింది.ఉత్తర్వుల జారీచేసిన తేదీ నుంచి రెండేళ్లపాటు అప్పలనాయుడు ఈ పదవిలో కొనసాగనున్నారు. తనకి ఈ బాధ్యతలు అప్పగించిన సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితిగజపతిరాజుకి ధన్యవాదాలు తెలిపారు.

విపత్తుల సమయంలో ఆదుకున్న సీఎం

● శృంగవరపు కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి


లక్కవరపుకోట:బాధితులకు నగదు అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

లక్కవరపుకోట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): విపత్తుల సమయంలో ప్రజలను ఆదుకున్న ముఖ్యమంత్రి ఒక్క చంద్రబాబేనని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. శుక్రవారం ఎల్.కోట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తుఫాను వల్ల నష్టపోయిన 49 కుటుంబాలకు రూ.97వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరెడ్ల ఈశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, టీడీపీ నేత కళ్లద్దాల శ్రీను, డీటీ ఎ.రమేష్, ఆర్ఐ సన్యాసిరావు పాల్గొన్నారు.

● వేపాడ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. వేపాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద తుఫాన్ వల్ల ఉపాధి కోల్పోయిన వల్లంపూడికి చెందిన పది చేనేత కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. తహసీల్దార్ రాములమ్మ ఆధ్వర్యంలో నిర్వహించినకార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, టీడీపీ నాయకులు గొంప వెంకటరావు, కొట్యాడ రమణమూర్తి, పోతల వెంకటరమణనాయుడు, గోగాడ జగన్నాథం నాయుడు పాల్గొన్నారు.

● ఎస్.కోట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుసోంపురంలో తుఫాన్ పునరావాస కేంద్రంలో నిర్వాసితులకు రూ. లక్షా 86వేలు అందించి నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శ్రీనివాసరాజు, సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

● జామి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):భీమసింగి రెల్లిపేటకు చెందిన 24 కుటుంబాలకు తుఫాన్ పురస్కరించుకుని పునరావాసం కల్పించగా వీరికి శుక్రవారం తహసీల్దార్ కృష్ణంరాజు ఆధ్వర్యంలో నిత్యావసరాలతో పాటు ఒక్కక్కరికి రూ.వెయ్యి అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు స్వామినాయుడు, పైడిరాజులు, పెద్దలు గొర్లె రవికుమార్, సత్యంనాయుడు, సంజీవీ,డీటీ మూర్తి పాల్గొన్నారు.

● రాజాం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాజాంలో 236 చేనేత కుటుంబాలకు రేషన్‌డిపోల ద్వారా తుఫాన్ వల్ల మగ్గం గుంతల్లో నీరుచేరడంతో శక్రవారం నిత్యావసర సరుకులు పంపిణీచేశారు. ఒక్కో కుటుంబానికి 50 కేజీల బియ్యం, కేజీ పంచదార, కేజీ ఉల్లిపాయలు, కేజీ బంగాళదుంపలు, లీటర్ ఆయిల్, కేజీ కందిపప్పు, పంపిణీ చేసినట్లు సీఎస్‌డీటీ అనంతకుమార్ తెలిపారు.



విజయనగరం క్రైం:కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్పీ తదితరులు



రాజాం రూరల్: కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం: ఎస్పీ

విజయనగరం క్రైం, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని ఎస్పీ దామోదర్ అన్నారు. పోలీ సు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా నగరంలోని మూడులాంతర్ల జంక్షన్ నుంచి కోట జంక్షన్ వరకూ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీని శుక్రవారం రాత్రి నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరై, ర్యాలీని ప్రారంభించా రు. కోట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన అమరవీరుల చిత్ర పటాలకు పూలమాల వేసి నివా ళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు అమరవీరుల సంస్మ రణ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఓపెన్ హౌస్ ర్యాలీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించామన్నారు. కార్యక్ర మంలో ఏఎస్పీ నాగేశ్వరరావు, విజయనగరం ఇన్‌చార్జి డీఎస్పీ గోవిందరావు, కోటి రెడ్డి, సీఐలు ఏవీ లీలారావు, ఆర్‌వీఆర్‌కే చౌదరి, శ్రీనివాసరావు, లక్ష్మణరావు, సూరినాయుడు, నర్సింహమూర్తి, ఆర్ఐలు రమేష్‌కుమార్, శ్రీనివాసరావు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలను స్మరించుకోవాలి: సీఐ

రాజాం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరులను నిత్యం స్మరించాల్సిన బాధ్యత పోలీస్‌లపై ఉందని రాజాంటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ తెలిపారు. అమరవీరుల ప్రాణత్యాగం ద్వారా సమాజానికి బంగారు బాటలువేశారని పేర్కొన్నారు. శుక్రవారం రాత్రి రాజాం అంబేడ్కర్ జంక్షన్‌లో ఏక్తా దివస్, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు పురస్కరించుకుని సీఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికిరణ్, ఏఎస్ఐలు వెంకటరమణ, సుగుణాకరరావు, రెడ్‌క్రాస్ రాజాం శాఖ అధ్యక్షుడు సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్యకుమార్, గర్లంకి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

● చీపురుపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి):యువత రక్తదానికి ముందుకు రావాలని సీఐ జి. శంకరరావు కోరారు. చీపురుపల్లిలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని పోలీసులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎల్.దామోదరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

యువత స్వశక్తితో నిలబడాలి

రాజాం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): యువత స్వశక్తితో నిలబడేందుకు స్వయం ఉపాధి వైపు అడుగులు వేయాలని కేవీఐసీ స్టేట్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.గ్రీప్ కోరారు. శుక్రవారం రాజాం జీఎంఆర్ నైరెడ్ సంస్థ కార్యాలయంలో గ్రామోద్యోగవికాస్ యోజనపై యువతకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రీప్ మాట్లాడుతూ యువత స్వయం సంవృద్ధి సాధించాలంటే స్వశక్తితో నిలబడాలని తెలిపారు. శిక్షణ పొందినవారికి పీఎంఈ జీపీ కింద ప్రభుత్వం రాయితీపై రుణ సౌకర్యం అందిస్తుం దని చెప్పారు. కార్యక్రమంలో నైరెడ్ డైరెక్టర్ రాజేష్, ప్రొగ్రాం మేనేజర్లు నగేష్ సాయి కిశోర్, కేవీఐసీ సిబ్బంది పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభలను జయప్రదం చేయండి

సంతకవిటి, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి):విశాఖలో డిసెంబరు 31 నుంచి జరగనున్న సీఐటీయూ 18అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి సీహెచ్ రూపావతిలు పిలుపునిచ్చారు. శుక్రవారం జీఎస్‌పురంలో మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. లక్షలాది మంది కార్మికులు, ఉద్యోగులతో మహా ప్రదర్శన జరగనుందని తెలిపారు.

ముస్తాబుకు సిద్ధం

(5వ పేజీ తరువాయి)

కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, క్రమశిక్షణ, బాధ్యత పెంపొందించడంలో 'ముస్తాబు' ఎంతగానో దోహదపడు తుంది. వ్యక్తిగత పరిశుభ్రతతో అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చు. పరిసరాల పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఉదయం సూర్య నమస్కారాలు, సాయంత్రం ఆటలు తప్పనిసరి.. ప్రభుత్వ , ప్రైవేట్ పాఠశా లల్లోనూ అమలు చేయాలి. ప్రతి వారం పరిశుభ్రత పాటిస్తున్న విద్యార్థికి గుర్తింపు ఇవ్వాలి. తద్వారా విద్యార్థుల్లో పరిశుభ్రతపై మరింత ఆసక్తి పెంచాలి.' అని తెలిపారు.

సేవలు ఎలా అందుతున్నాయ్!

(5వ పేజీ తరువాయి)

అడుగుతున్నారా? అని నేరుగా అర్జీదారుడినే అడుగు తున్నారు. దీనిలో భాగంగానే ఈ ఏడాది జూన్ నుంచి అర్జీదారులకు ఏమేరకు సమస్యలు పరిష్కారమయ్యాయనే వివరాలు సేకరిస్తున్నారు. ఒకవేళ అర్జీ పెండింగ్‌లో ఉంటే ఎందువల్ల పరిష్కారం కాలేదో తెలుసుకుని.. ఆ సమాచారాన్ని తిరిగి ఆయా జిల్లా డివిజన్, మండల గ్రామస్థాయిలో ఉద్యోగులకు చేరవేస్తున్నారు. సంబంధిత శాఖ నుంచి వివరణ కోరుతూ కచ్చితమైన సమాధానం చెప్పాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లాలో వివిధ శాఖల ఉద్యోగుల పనితీరుపై ప్రతి మూడు నెలలకొకసారి ఉన్నతాధికారులకు సమాచారం అందుతుండడంతో క్షేత్ర స్థాయి సిబ్బంది మరింత అప్రమత్తమవుతున్నారు. కాగా ప్రభుత్వ తాజా నిర్ణయంపై జిల్లావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకుంటాం



క్యాబేజీ రైతులతో ఎమ్మెల్యే జయకృష్ణ

వీరఘట్టం, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): తుపాన్ కారణంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. శుక్రవారం సీఎస్ఆర్‌పేటలో తుపాన్ కారణంగా నష్టపోయిన క్యాబేజీ పంటను పరిశీలించారు.అనంతరం మండలంలో పలు గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, ఉదయ్‌భాస్కర్, జామి లక్ష్మీనారాయణ, చింతా ఉమ, రామకృష్ణనాయుడు, ఉద్యానవన శాఖ అధికారి జయశ్రీ పాల్గొన్నారు.

సభ్యుల వాగ్వాదం

సాలూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అధికారులు టీడీపీ కొమ్ముకాస్తున్నారని వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు మండల సమావేశంలో ఆరోపించడం వాగ్వాదానికి దారి తీసింది. దాంతో గందరగోళ పరిస్థితి నెలకొంది. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గరుగుబిల్లి రాములమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఉపాధి పనులను ఏపీవో టి.రామకృష్ణ, పంచాయతీరాజ్ పనులను ఏఈ వరలక్ష్మి వివరిస్తుండగా వైసీపీ ఎంపీటీసీ సభ్యులు, ఆ పార్టీ మద్దతుదారులైన సర్పంచ్‌లు అడ్డుకున్నారు. ఉపాధి సిబ్బంది సర్పంచ్‌లకు విలువ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సర్పంచ్‌లు సుకన్య, లక్ష్మణ, నూకయ్య, ఎంపీటీసీ సభ్యుడు కల్లేపల్లి త్రినాథనాయుడు అధికారులపై ధ్వజమెత్తారు. దీంతో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ జోక్యం చేసుకున్నారు. అభివృద్ధి పనులు వద్దనుకుంటే అధికారులు ఏమి చేస్తారని ప్రశ్నించారు. ఈ అంశంపై ఇరుపార్టీల సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వావాదం చోటు చేసుకుంది. దాంతో సమావేశాన్ని అర్థాంతరంగా వాయిదా వేశా రు. సమావేశంలో ఎంపీడీవో గొల్లపల్లి పాల్గొన్నారు.

ముగిసిన సంస్మరణ వారోత్సవాలు

పాలకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి పాలకొండ డీఎస్పీ ఎం.రాంబాబు, టీడీపీ సీనియర్ నాయకులు పల్లా కొండలరావు ఆధ్వర్యంలో శుక్రవారం పాలకొండ పోలీస్‌స్టేషన్ ఆవరణలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. రక్తదాన శిబిరంలో 104 మంది రక్తదానం చేశారు. శుక్రవారం రాత్రి ఎం.రాంబాబు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల కోసం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీఐ ప్రసాదరావు, ఎస్ఐ ప్రయోగమూర్తి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, కూటమి నాయకులు అడపా బాబ్జీ పాల్గొన్నారు.

●మక్కువ రూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం రాత్రి మక్కువలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మంగన్న, కోరన్నలకు నివాళి

కురుపాం రూరల్ అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కామ్రేడ్ మంగన్న, కోరన్నల వర్ధంతి సభ శుక్రవారం మామిడిమానుగూడలో నిర్వహించారు. గిరిజన సంఘం నాయకుడు బిడ్డిక వెంకటరావు అధ్యక్షతన జరిగిన సభకు సీపీఎం జిల్లా అధ్యక్షుడు కొల్లి గంగునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత మంగన్న, కోరన్నల స్థూపానికి నివాళులు అర్పిం చి ఊరేగింపుగా సభాస్థలికి చేరుకున్నారు.

●గుమ్మలక్ష్మీపురం: కోరన్న, మంగన్న స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని సీపీఐ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి తోట జీవన్న పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళాపురంలో బిడ్డిక రమణ మూర్తి అధ్యక్షత కార్యక్రమం జరిగింది.

ఆరోగ్యంపై మహిళలు శ్రద్ధ వహించాలి

● మంత్రి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సూచించారు. శుక్రవారం పట్టణంలోని దాసరివీధిలోగల ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో మహిళల కోసం శక్తి సురక్ష హెల్త్ స్ర్కీనింగ్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఆరోగ్య పరీక్షల ప్రాధాన్యాన్ని వివరించారు. సమాజంలో మహిళల భాగస్వామ్యం పెరగాలంటే ఆర్థిక సుస్థిరత మాత్రమే కాకుండా శారీరక, మానసిక ఆరోగ్యం కూడా ఎంతో ముఖ్యమన్నారు. ప్రతీ కుటుంబం సురక్షితంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యం కీలకమన్నారు. కార్యక్రమంలో మహిళలకు బీపీ, షుగర్, రక్త పరీక్షలు, క్యాన్సర్ స్ర్కీనింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వినతుల స్వీకరణ

పట్టణంలోని క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించాలని ఆదేశించారు.

మహిళల ఆరోగ్యంపై శ్రద్ధ

●పార్వతీపురం టౌన్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యంపై సీఎం చంద్రబాబు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో ఆయన సఖీ సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళా సంఘాల్లోని సభ్యులకు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను నిర్వహించను న్నారన్నారు. ఈ అవకాశాన్ని మహిళలందరూ వినియోగించుకోవాలని కోరారు.



ఆరోగ్య పరీక్షలను పరిశీలిస్తున్న మంత్రి సంధ్యారాణి



ఆరోగ్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంలో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడంలో ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని డంపింగ్ యార్డులో వ్యర్థాల రీసైక్లింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డంపింగ్‌యార్డులోని సుమారు 50 వేల టన్నుల చెత్త వ్యర్థాలను ఐదు విడతలుగా రీసైక్లింగ్ చేయడంతో పాటు సేంద్రియ ఎరువుల తయారీ ప్రక్రియ మరో వైపు జరుగుతుందన్నారు. ఆయనతో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పటేల్‌కు ఘన నివాళి

పార్వతీపురం రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర.. పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మె ల్యే మాట్లాడుతూ 1100 సంస్థానాలను భారత్‌లో విలీన చేసిన ఘనత పటేల్‌దేనన్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు.

బాధితులకు చెక్కుల అందజేత

పార్వతీపురం రూరల్/ బెలగాం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పార్శిల్ కౌంటర్ వద్ద అక్టోబర్ 19న జరి గిన పేలుగు ఘటనలో బాధితులకు చెక్కులను ఎమ్మెల్యే బోనెల విజ యచం ద్ర పంపిణీ చేశారు. విజయవాడలో ఆర్టీసీ ఎండి ద్వారకా తిరుమలరావును ఎమ్మెల్యే ప్రత్యేకంగా కలిసి బాధితుల పరిస్థితిని వివరించి ఆర్థికసాయం కోరిన విషయం తెలిసిందే. దాంతో రవాణా శాఖ నుంచి బాధితులకు రూ.9.75 లక్షలు విడుదలయ్యాయి. వాటిలో రెడ్డి రమేష్‌కు రూ.5 లక్షలు, కె.రమేష్‌కు రూ.4 లక్షలు, డ్రైవర్ టి.రవికి రూ. 50 వేలు, బి.సుందరరావుకు రూ.25 వేలు చొప్పున చెక్కులను అందజేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే..

●పార్వతీపురం రూరల్, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతు లను స్వీకరించారు. సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలపై కూలిన చెట్టు

●విరిగిన ఏడు స్తంభాలు

సాలూరు రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సాలూరు రైల్వే స్టేషన్ రోడ్డులో రాజుగారి కల్లం వద్ద భారీ వృక్షం శుక్రవారం వేకువ జామున 2 గంటల ప్రాంతంలో కుప్పకూలింది. చెట్టు విద్యుత్ తీగెలపై పడడంతో ఏడు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. దీంతో సాలూరు పట్టణం, మండలంలో అంధకారం అలముకుంది. విషయం తెలుసు కున్న విద్యుత్ శాఖ డీఈ ప్రసన్నకుమార్, ఏఈ నాగేశ్వరరావు సిబ్బం దితో వెళ్లి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. సాలూరు పట్టణం, మండలానికి పాచిపెంట మండలం గురినాయుడుపేట విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి రాత్రయిన పునరుద్దరణ పనులు చేస్తు న్నారు. దేవుబుచ్చింపేట 33 కేవీ సబ్ స్టేషన్ నుంచి శనివారం ఉద యానికల్లా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించనున్నట్టు ఏఈ నాగేశ్వరరావు తెలిపారు.

పంట ముంపు నివారణకు చర్యలు

గరుగుబిల్లి, అక్టోబరు31 (ఆంధ్రజ్యోతి): రావుపల్లిలోని దేసూరిగెడ్డ ప్రాంతంలోని పంట పొలాలు ముంపునకు గురికాకుండా అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు నీటి పారుదలశాఖ డీఈఈ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. శుక్రవారం దేసూరిగెడ్డ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బొంతాడ మహేష్ పలు సమస్యను ఆయన కు వివరించారు. ఏటా వరదలకు గెడ్డకు ఆనుకుని ఉన్న 400 ఎకరా లకు పైగా వరి పంట అధికంగా ముంపునకు గురవుతుందన్నారు. ముంపునకు గురికాకుండా గెడ్డ పరిధిలో పూడికలు, పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉందన్నారు. అందుకు డీఈఈ సానుకూలంగా స్పందిం చారు. అవసరమైన పనులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

సచివాలయ ఉద్యోగిపై కేసు నమోదు

సీతంపేట రూరల్, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన సచివాలయ ఉద్యోగి ప్రభుసాగర్‌పై ఓయువతి శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసుకు సంబం ధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ కస్పావీధికి చెందిన ప్రభుసాగర్ పాలకొండ పట్టణంలోని సచివాలయంలో ఉద్యోగం చేస్తున్నాడు. ప్రేమిస్తున్నాను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి తనను మో సం చేశాడని యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేశారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించండి

●రిలే దీక్షను ప్రారంభించిన సాధన సమితి



మాట్లాడుతున్న భూదేవి

పాలకొండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లాను చేయాలని, లేకుంటే శ్రీకాకుళం జిల్లాలో కలపాలని జిల్లా సాధన సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం స్థానిక కోటదుర్గమ్మ ఆలయం వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు అన్ని పార్టీలు, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి నియోజకవర టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి మాట్లా డుతూ ప్రజల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని పాలకొండను జిల్లా చేయాలన్నారు. ౧. రిలే నిరాహార దీక్షలో సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరి నాయుడు, సాధన సమితి ట్రెజరర్ సబ్బ నానాజీ, రైతు సంఘం విజయ నగరం జిల్లా అధ్యక్షుడు నారు జనార్దనరావు, కార్యక్రమంలో బి.కాంతారావు, కిల్లారి మోహన్, శాసపు సర్వారావు, వెన్నపు వెంకట రమణ, అల్లెన శ్రీనివాసరావు, రుంకు శ్రీనివాసరావు, వారాడ దుర్గారావు, కె.వి.రమణమూర్తి, అప్పలనాయుడు తదితరులున్నారు.

సబ్ కలెక్టర్ పర్యటన

పార్వతీపురం, అక్టోబరు31 (ఆంధ్ర జ్యోతి): ఇళ్ల స్థలాల దరఖాస్తు దారు లను సబ్ కలెక్టర్ వైశాలి క్షేత్ర స్థాయి లో పరిశీలించారు. శుక్రవార గోపాల పురం, అడ్డాపుశీల, పిన్నింటి, రామి నా యుడువలసల్లో ఆమె పర్యటించారు.

ఘనంగా ఐక్యతా దినోత్సవం

బెలగాం, అక్టోబరు 31 (ఆంధ్ర జ్యోతి): ఉక్కు మనిషి సర్దార్ వల్ల భాయ్ పటేల్ జయంతిని శుక్రవారం పార్వతీపురంలో ఐక్యమతా దినోత్సవా న్ని నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్య క్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యం లో కార్యక్రమం జరిగింది. ఈ సంద ర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ సం స్థానాలను విలీనం చేసి దేశ సమైక్యతను పటేల్ కాపాడారన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధంకండి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికలకు క్యాడర్ సిద్ధం కావాలని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పిలుపునిచ్చారు. కూటమి నాయకులందరూ సమష్టిగా ముందుకు సాగాలని సూచించారు. శుక్రవారం కేదారిపురంలో ఆమె ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజలకు తెలియజేయాలన్నారు. కూటమి అభ్యర్థులు గెలిచే కష్టపడి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, ఎస్టీ కమిషన్ సభ్యుడు కడ్రక మల్లేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అడ్డాకుల నరేష్, బీజేపీ ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు నిమ్మక సింహాచలం, బీజేపీ మండల అధ్యక్షుడు కడ్రక అప్పలసామి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు మండంగి భూషణరావు, పాడి సుదర్శన రావు, క్రాంతికుమార్, తాడంగి లక్ష్మణరావు, వెంకటరావు, బుజ్జేశ్వరరావు తదితరులున్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రజాదర్బార్ ఉద్దేశ మని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కేదారిపురంలో ఆమె ప్రజదార్బర్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆమె ఆదేశించారు.

కేజీబీవీ విద్యార్థినులకు అస్వస్థత

మక్కువ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కాశీపట్నం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన నలుగురు విద్యార్థినులు శుక్రవారం అస్వస్థతకు గురయ్యారు. వారిని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఎంపీడీవో అర్జునరావు మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థినులు కర్ర స్వాతి, భూతాల శైలజ, కె.శ్రీదేవి, ఇంటర్మీడియట్ విద్యార్థిని ఎం.భవానీలను మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ముందుగా తరలించామన్నారు. అక్కడి డాక్టర్ సూచనల మేరకు కర్ర స్వాతికి కడుపు నొప్పిగా ఎక్కువగా ఉందని చెప్పగా బొబ్బిలిలోని ప్రైవేటు ఆసుపత్రికి, భూతాల శైలజకు ఒళ్లు నొప్పులు, బ్లడ్ ఇన్‌ఫెక్షన్ ఉందని పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించామన్నారు.. కె.శ్రీదేవికి సెగడ్డలు, ఎం.భవానికి చర్మ సంబంధిత వ్యాధి రావడంతో మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేసి విద్యాలయానికి పంపించారని తెలిపారు. నలుగురు విద్యార్థినులకు ఆరోగ్యం బాగాలేదని పాఠశాల ప్రిన్సిపాల్ దుర్గ సమాచారమివ్వడంతో విద్యాలయాన్ని సందర్శించి వారిని ఆసుపత్రులకు తరలించామన్నారు.